

- జిల్లాలో పెరిగిన చలి తీవ్రత
- చెడిపోయిన సోలార్ ప్లాంట్లు..చన్నీటి స్నానాలు
- సరిపడా వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- హాస్టళ్లపై 'ఆంధ్రజ్యోతి విజిట్'

వసతి వణుకుతోంది



దహెగాంలో చన్నీటి స్నానాలు చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలితీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఈదురు గాలులు వీస్తుండటంతో ప్రజలు గజగజ వణుకుతు న్నారు. మరికొన్ని రోజులు చలితీవ్రత ఇలాగే ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరి స్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హస్టళ్లు, గురుకులాల్లో చలి తీవ్రతతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సరిపడా వసతులు లేక అష్టకష్టాలు పడుతున్నారు.

కొన్ని హస్టళ్లలో తలుపులు, కిటికీలు, దుప్పట్లు వంటి కనీస సౌకర్యాలులేక చలితీవ్రతకు వణుకుతు న్నారు. వసతి గృహాల విద్యార్థులకు వేడి నీళ్లందిం చేందుకు మంజూరు చేసిన సోలార్ వాటర్ హీటర్లు కొన్నిచోట్ల మరమ్మతులకు నోచుకోక నిరుప యోగంగా ఉండటంతో విద్యార్థులు చన్నీటితోనే స్నా నాలు చేయా ల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' న్యూస్‌నెట్ వర్క్ హస్టల్ విజిట్ చేపట్టింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, స్థితిగతులు వెలుగులోకి వచ్చాయి.

జిల్లాలోని గురుకులాలు, వసతి గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఐదు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, నాలుగు మహత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు, మూడు మైనార్టీ గురుకులాలు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల, 15 కస్తూర్బాగాంధీ పాఠశాలలు, రెండు ఆదర్శ పాఠశాలలు, 44 గిరిజన ఆశ్రమ, ఆశ్రమోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా వివిధ సంక్షేమశాఖల కింద వసతిగృహాలు కొనసాగుతున్నాయి.ఇందులో సుమా రు 12వేల పైచిలుకు విద్యార్థులు విద్యనభ్యసి స్తున్నారు.

● నేలపైనే నిద్ర..

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వసతి గృహాల్లో చాలా చోట్లా విద్యార్థులు చన్నీటితోనే స్నానాలు చేయాల్సి వస్తోంది. ఉదయాన్నే చలికి వణుకుతూ చల్లని నీటితోనే స్నానాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. జన్కాపూర్ బీసీ వసతి గృహంలో విద్యా ర్థులు నేలపైనే పడుకుంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గురుకులాలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఆసిఫాబాద్‌లోని బీసీ వసతి గృహంలో నేలపైనే పడుకున్న విద్యార్థులు

● చన్నీటి స్నానాలే

రెబ్బెన(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండ లంలోని గోలేటి ఆశ్రమ పాఠ శాలలో విద్యార్థులు చన్నీళ్లతో స్నానం చేయా ల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ గతం లో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. దీంతో చిన్నారులు కొందరు కట్టెల పొయ్యిపై నీళ్లు వేసి చేసుకుని స్నానం చేస్తున్నప్పటికీ చాలా మంది చన్నీటి స్నానమే చేస్తున్నారు. హస్టల్లో మొత్తం 127 మంది పిల్లలు ఉన్నారు. వారికి ఇటీ వలనే దుప్పట్లను పంపిణీ చేయడం జరిగిందని, పడుకోవడానికిగదులు సక్రమంగానే ఉన్నాయి.

● రగ్గుల పంపిణీ లేదు..

బెజ్జూరు(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతు న్నాయి. మండలంలోని సోమిని, కుంటల మానేపల్లి, సలుగుపల్లి, బెజ్జూరు గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలలు ఉన్నా యి. మండల కేంద్రంలోని కేసీబీవీ గురుకులం ఉంది. ఆయా పాఠశాలల్లో ఇప్ప టికీ రగ్గులు పంపిణీ చేయడం లేదు. పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు పనిచేయని కారణంగా చన్నీటితో స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు సరిపడ మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పోవడంతో అవస్థలు పడుతు న్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు పని చేయని కారణంగా తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సరైన వసతులు లేకపోవడంతో సమస్యలతో సహవాసం చేస్తున్నారు.

● మెనూ పాటించడం లేదు..

దహెగాం(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కల్వాడ ఆశ్రమోన్నత పాఠశాలలో 202 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రెండు సంవత్సరాలుగా సోలార్ వాటర్ హీటర్ చెడిపోవడంతో విద్యార్థులు చన్నీటి స్నానాలు చేస్తున్నారు. అదేవిధంగా విద్యార్థులకు భోజనంలో మెనూ పాటించడం లేదు. పట్టణ ప్రాంతాల నుంచి వార్డెన్ రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థులు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే బాలికలు 284 మంది ఉన్నారు. ఇటీవలే ఈ రెండు పాఠశాలల్లో విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

● వేడి నీటిని అందించాలి..

తిర్యాణి(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండల కేంద్రం లోని ఆశ్రమ పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్లు పనిచేయక చన్నీటి స్నానం చేయాల్సి వస్తోంది. అసలే తిర్యాణిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో సోలార్ హీటర్లు మరమ్మతులు చేయించి వేడినీటిని అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే మంగి, చెలిమెల, సింగాపూర్, రొంపల్లి ఆశ్రమ పాఠశాలల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

● సరిపడా మూత్రశాలలు కరువు..

పెంచికలపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు తాండ విస్తున్నాయి. మండలంలోని ఎల్లూరు, కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఇప్పటికీ రగ్గులు పంపిణీ చేయడం లేదు. పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు పని చేయని కారణంగా చన్నీటితో స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పోవడంతో అవస్థలు పడుతు న్నారు. సరైన వసతులు లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● విద్యార్థులను వణికిస్తున్న చలి

లింగాపూర్/జైనూర్: లింగాపూర్, జైనూర్ మండలంలోని మారుమూల గ్రామాల్లోని సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులను చలి వణికిస్తోంది. మూడు రోజుల నుంచి చలి తీవ్రత ఎక్కువ కావడంతో జైనూర్ మండలంలోని పోచ్చంలలొద్ది, పానపటార్, సోనాపూర్, మార్లవాయి, రాసిమెట్ట, కేజీబీవీ, లింగాపూర్ మండలంలోని కేజీబీవీ, కంచంన్‌పల్లి ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వేడినీటి యంత్రాలు లేక చల్లటి నీటితోనే స్నానాలు చేస్తున్నారు. చలి నుంచి రక్షణకు బ్లాంకెట్‌లు పంపిణీచేయాలని కోరుతున్నారు.

● పనిచేయని సోలార్ హీటర్లు..

సిర్పూర్(టి)(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని వసతి గృహాల్లో సోలార్ హీటర్‌లు పని చేయకపోవడంతో విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తు న్నారు. ప్రత్యామ్నాయంగా వార్డెన్ కట్టెల పొయ్యిలను ఏర్పాటు చేస్తున్నారు. వసతి గృహంలో బోరు కూడా పని చేయకపోవడంతో వృథాగా పడి ఉంది.


సిర్పూర్(టి)లో పనిచేయని సోలార్ హీటర్ ప్లాంట్

విద్యార్థులకు స్వెటర్ల పంపిణీ

సిర్పూర్(టి), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడు తంగెడపల్లి రాకేష్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సోమవారం 15 మంది విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. రాకేష్ గతంలో ఇదే పాఠశాలలో తొలిసారిగా ఉపాధ్యాయ పోస్టింగ్ చేపట్టడంతో పాఠశాలకు విరాళంగా స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లింగారెడ్డి, కార్యదర్శి సందీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వనభోజనం

బెజ్జూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని అటవీ ప్రాంతంలో మాణిక్యదేవర వద్ద దేవాంగ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వన భోజనం కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్యాంసుందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించి.. భరోసా కల్పించి..

- ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే దరఖాస్తుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అందిన దరఖాస్తులు..

● ఆసిఫాబాద్ పట్టణం సందీప్‌నగర్‌కు చెందిన షేక్ మున్నా తనకు పెన్షన్ ఇప్పించాలని అర్జీ సమర్పించారు.

● సిర్పూర్(టి) మండలం పూసిగూడ గ్రామానికి చెందిన గిరిజనులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అటవీ శాఖ సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

● రెబ్బెన మండలం గోలేటికి చెందిన దేవయ్య తన తండ్రి పేరిట ఉన్న భూమిని ఆయన మరణించినందున తన పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

● చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన యువకులు తమ గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

● సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన దుర్గం నిర్మల తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పారిగాం గ్రామానికి చెందిన కారుబాయి తన భర్త మరణించినందున డెత్ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

● కాగజ్‌నగర్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన పర్వీన్ సుల్తానా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

● రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన పెద్దపల్లి లక్ష్మి తాను సాగు చేస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

విధులకు వైద్యురాలి డుమ్మా


ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

పెంచికలపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసింది. అయితే వైద్యుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వెరసీ ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ వైద్యులు విధులకు డుమ్మా కొడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు రాక సోమవారం ఖాళీ కుర్చీ దర్శనమిచ్చింది. ల్యాబ్ టెక్నీషియన్ మధ్యాహ్నం లోపే ఇంటి ముఖం పట్టాడు. ఓపీలో 75 మంది రోగులు వివిధ అనారోగ్య సమస్యలతో రాగా ఆసుపత్రి సిబ్బంది వైద్యం అందించి మందులు ఇచ్చి పంపించారు. చలి ప్రభావం పెరగడంతో జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్ల నొప్పులు తదితర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులు ప్రబలే సమయంలో వైద్యురాలు విధులకు గైర్హాజరు కావడంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో సీతారాంను సంప్రదించగా తనకు ఎలాంటి సమాచారం లేదని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


టెక్నీషియన్ లేక ఖాళీగా ఉన్న ల్యాబ్

రెండో రోజూ పోటెత్తిన భక్తజనం


కంకాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌటాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై గల కంకాలమ్మ కేతేశ్వరస్వామి రమాసహిత సత్యనారాయణ స్వామి దర్శనానికి భక్తులు రెండో రోజూ పోటెత్తారు. సోమవారం సంత రోజు కావడంతో సంతకు వచ్చే భక్తులు ముందుగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నల్ల పోచమ్మ వద్ద కోళ్లు, మేకలు బలిచ్చి గుట్టపై వంటావార్పు చేసి బోనాన్ని సమర్పించుకున్నారు. అమ్మవారిని జిల్లా అదనపు ఎస్పీ చిత్తరంజన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రహ్లాద్ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌటాల సీఐ సంతోష్, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.


అదనపు ఎస్పీ చిత్తరంజన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

108, 102 అంబులెన్స్‌ల తనిఖీ

చింతలమానేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 108, 102 అత్యవసర సేవల అంబులెన్స్‌ను 108 జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ స్టాక్, మెడికల్ ఎక్విప్మెంట్, వర్కింగ్ కండీషన్ రికార్డ్ తనిఖీ చేసి మండల ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కాల్ వచ్చిన వెంటనే అంబులెన్స్‌తో తొందరగా బయలుదేరాలని సిబ్బందికి సూచించారు. కార్యకరమంలో మెడికల్ టెక్నిషియన్ సాగర్, పైలట్ నరేష్, 102 పైలెట్ రాకేష్ పాల్గొన్నారు.


అంబులెన్స్‌ల వద్ద జిల్లా మేనేజర్ నరేష్

విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు ఉండాలి

- జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి విషయాల వారీగా కనీస అభ్యసన సామర్థ్యాలతో పాటు డిజిటల్ సామర్థ్యాలను, 21వ శతాబ్దపు నైపుణ్యాలను సాధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. సాంఘిక శాస్త్రం, ఆంగ్లం విషయాలకు సంబంధిం చిన డిజిటల్ సామర్థ్యాలను, 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల కోసం 'ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్' ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా డివిజనల్‌లోని సాంఘిక శాస్త్రం, ఆంగ్ల భాష ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. టెక్నాలజీ పెరిగిన ఈ కాలంలో సామాన్య పౌరులు రకరకాల యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లు, లింకులు క్లిక్ చేయడం ద్వారా మోసానికి గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయులు ఈ అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్‌లోని ప్రతీ అంశాన్ని ప్రతి ఒక్క విద్యార్థికి చేరేలా విద్యాబోధన చేయాలని ఆదేశించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు డిజైన్ ఆలోచన, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు డిజిటల్ పౌరసత్వంనకు సంబంధించిన అంశాలు పాఠ్య ప్రణాళికల ప్రకారం బోధించాలని సూచించారు. సమావేశంలో ఆర్పీలు రాజు, విజేష్, ఉపాధ్యాయులు తులసీరాం, ఊశన్న, ప్రిన్సిపాల్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ద్వారా..
ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జాతీయ నిర్మాణ రంగ అకాడమీలో జిల్లాకు చెందిన 23 మంది భవన నిర్మాణ కార్మికులు శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని భవన నిర్మాణ కార్మికుల కొరత ఉందని తెలిపారు. జాతీయ నిర్మాణరంగం అకాడమీలో శిక్షణ పొందడం ద్వారా ఇళ్ల నిర్మాణంలో నైపుణ్యంతో పనులను వేగవంతం చేయవచ్చని, మరింత ఉపాధి అవకాశాన్ని కల్పించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, గృహనిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు, అధికారులు, శిక్షణ పొందిన కార్మికులు పాల్గొన్నారు.

తలసేమియా పిల్లలకు పింఛన్ మంజూరు చేయండి


కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తలసేమియా, సికిల్ సెల్‌తో బాధపడుతున్న పిల్లలకు పెన్షన్ మంజూరు చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు, దివ్యాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లా ఆసుపత్రిలో రక్తం ఎక్కించి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, బాపురావు, శ్రీవాణి, దయాకర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

పెండింగ్ బిల్లులు చెల్లించండి..

సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలు, మహాత్మాజ్యోతి బాపూలే, మైనార్టీ, హాస్టల్‌కు సంబంధించి ఐదు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు కాంట్రాక్టర్లు ప్రజావాణి కార్యక్రమం లో వినతిపత్రం అందజేశారు.

వీధి దీపాల ఏర్పాటు




కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన వీధి దీపాలు

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చిర్రకుంట ఎక్స్ రోడ్డు నుంచి అంకుశాపూర్ మెడికల్ కళాశాల వరకు సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

అయ్యప్ప మండల పూజ

బెల్లంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు ప్రథమ మండల పూజను సోమవారం నిర్వహించారు. గణపతి హోమం, ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. అయ్యప్పస్వామి భక్తులతో పాటు స్థానిక పట్టణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి అన్నదానం నిర్వహించారు. ఆలయ పూజారి కుటుంబరావు, గురు స్వాములు రమేశ్, రాయమల్లు, మంగమూర్తి, శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు..



- వానరాల వీరంగం
- ఇళ్లలోకి చొరబడి వస్తువుల అపహరణ
- భయాందోళనలో ప్రజలు
- కోతుల నియంత్రణలో అధికారులు విఫలం

ఆసిఫాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కోతుల బెడద రోజు రోజుకు పెరుగుతోంది. కోతులు గుంపులుగుంపులుగా బయలుదేరి కాలనీలపై విరుచుకుపడుతున్నాయి. ఇళ్లు, దుకాణాల్లో తినుబండరాలు, వస్తువులను ఎత్తు కెళ్లడంతో పాటు పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. అంతే కాకుండా ప్రజలపై దాడులకు దిగుతూ గాయ పరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇళ్లలోకి చొరబడి వస్తువుల అపహరణ..

అడవిలో జీవించాల్సిన కోతులు ఉర్లమీద పడుతున్నాయి. అటవీ ప్రాంతాలు రోజురోజుకు తగ్గి పోవడం వాటికి అడవిలో ఆహారం లభించకపోవడంతో గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్నాయి. గుంపులుగుంపులుగా కాలనీల్లో సంచరిస్తూ వీరంగం సృష్టిస్తున్నాయి. ఇళ్లలో తయారు చేసుకున్న భోజనాలతో పాటు పప్పు దినుసులు పట్టుకెళ్తున్నాయి. కిరణా షాపులు, పండ్ల దుకాణాలదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడదతో పెంకు టిళ్ల ధ్వంసం అవుతున్నాయి. ఆరుబయట ఎండ బెట్టిన పప్పు దినుసులు ఇతర ఆహార పదర్థాలనూ వదలటం లేదు. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి ఇతర పండ్ల చెట్లు, కూరగాయాల చెట్లను సైతం వదల కుండా ధ్వంసం చేస్తున్నాయి.

భయాందోళనలో ప్రజలు..

కోతుల బెడద రోజురోజుకు ఎక్కువ కావడంతో పట్టణ వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో అవి ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కోతికాటుకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. మిద్దెల మీద గుంపులు గుంపులుగా ఒక చోట చేరి వచ్చి పోయే వారిపై దాడిచేస్తూ భయ భ్రాంతు లకు గురిచేస్తున్నాయి. కోతులబెడద తీవ్రం కావడంతో కొంతమంది టపాసులు, పెద్ద శబ్దాలు చేస్తూ వాటిని తరిమి వేస్తున్నారు.

నియంత్రణ కోసం చర్యలు శూన్యం..

పట్టణంలో కోతుల నియంత్రణ కోసం అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి పట్టణం నుంచి అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తు న్నారు. కోతుల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారినుంచి రక్షణ కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి కోతుల బెడద నుంచి విముక్తి చేయాలని కోరుతున్నారు.

కోతులతో ఇబ్బందులు పడుతున్నాం..

జ్యోతి, గృహిణి, ఆసిఫాబాద్



కోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందరగా పడేస్తున్నాయి. పప్పు దినుసులు, ఆహార పదార్థా లు, కూర గాయలు ఎత్తుకెళ్తున్నాయి. వీటిని తరిమేందుకు ప్రయ త్నించగా అవి దాడులకు దిగుతున్నాయి. అధికారులు నియంత్రణ చర్యలు చేట్టాలి.



ఆసిఫాబాద్ పట్టణంలో సంచరిస్తున్న కోతులు

ఆన్‌లైన్‌లో పోగొట్టుకున్న సొమ్ము రికవరీ



నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులతో సీఐ అశోక్

నస్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణానికి చెందిన పలువురు అన్‌లైన్‌లో పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేసి బాధితులకు సోమవారం అందించినట్లు సీఐ అశోక్ తెలిపారు. నస్పూర్‌కు చెందిన గోపు కుమారస్వామి, పొడిశెట్టి శ్రీనివాస్, బొలిశెట్టి కార్తీక్, లింగం స్వరూప, అక్కల నరేష్, నాకిర్త భద్రయ్య ఆరు నెలల క్రితం అన్‌లైన్‌లో పోగొట్టుకున్న సొమ్మును కోర్టు ఆర్డర్ ద్వారా నేరస్థుల ఆకౌంట్లను హోల్డ్ చేసి రూ. 3.16 లక్షల సొమ్మును రికవరీ చేసి బాధితులకు అందజేశారు. తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ సొమ్ము వస్తుందని ఆశపడి అన్‌లైన్ ప్రకటనలను నమ్మి డబ్బు పెట్టుబడి పెట్టారు. తిరిగి డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. గడిచిన ఆరు నెలల్లో సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ఫిర్యాదులు వచ్చాయని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి కవిత ద్వారా రిఫండ్ ఆర్డర్ తీసుకుని బాధితులకు సొమ్మును అందజేశామన్నారు. సైబర్ వారియర్ సతీష్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నాగరాజును పోలీసులు అభినందించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

హాజీపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో గల పత్తి చేనులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు హాజీపూర్ పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 87126 58667, 87126 59474 87126 56541 నంబర్లలో సమాచారం అందించాలని తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం చింతపండువాడకు చెందిన పసుల కిషోర్ (45) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై వెంకన్నగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం కిషోర్‌కు సమతతో వివాహం అయింది. వీరికి ఐదేళ్ల కుమారుడు అనిరుడ్ ఉన్నాడు. కొంతకాలంగా కిషోర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆ కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఎంత చెప్పినా అతని తీరు మారకపోవడంతో భార్య కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో కిషోర్ జీవితంపై విరక్తి చెంది బెడ్‌రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



విజయ్(ఫైల్)

వాంకిడి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని బెండార గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కమాన గ్రామానికి చెందిన నగోసె విజయ్(39) అనే యువకుడు మృతిచెందాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్ తన ద్విచక్ర వాహనం (టీజీ 20 2184)పై సొంత పని నిమిత్తం బెల్లంపల్లికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో రాత్రి 12 గంటల సమయంలో బెండార గ్రామశివారులో జాతీయ రహదారి మూలమలుపు వద్ద అదుపుతప్పి డీవైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు విజయ్ తండ్రి నగోసె మల్లు ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం

- రెండు ద్విచక్రవాహనాలు నుజ్జునుజ్జు



విరిగిన విద్యుత్ స్తంభం

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని అంబేద్కర్ చౌరస్తా పక్కన కారు ఢీకొని సోమవారం విద్యుత్ స్తంభం ధ్వంసం అయ్యింది. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా, అతి వేగంగా కారు నడిపి ఘటనకు కారణమైన రాహుల్‌పై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ సీఐ ప్రేంకుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఓ కారు (టిఎస్20టి-8466)లో రాహుల్ అనే యువకుడు మద్యం మత్తులో అతి వేగంగా నడపించి ఢీకొట్టడంతో కరెంటు స్తంభం విరిగిపోయింది. అలాగే పక్కనే ఉన్న రెండు ద్విచక్రవాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టౌన్ ఎస్సై లక్ష్మణ్ ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వైన్ షాప్‌లు ఎత్తివేయాలని ఆందోళన



ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

కాగజ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం పంచశీలనగర్‌లో జనావాసాల మధ్య గల వైన్ షాపులను ఎత్తివేయాలని డిమాండు చేస్తూ మహిళలు సోమవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళనకు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కొంతమంది మందుబాబులు తాగిన మైకంలో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వైన్‌షాప్‌లను ఇతర చోటికి తరలించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎక్సైజ్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వాంకిడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం, సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ కవితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులను ఇబ్బందులు పెట్టే విధంగా తీసుకొచ్చిన నూతన విధానాలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అధిక వర్షాలతో పత్తి రైతులు నష్ట పోయారని సకాలంలో పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, మహేష్, రాకేష్, వెంకటేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కడంబా అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారం

కాగజ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం కడంబా అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి చిరుతపులి సంచరించింది. ఈ మార్గం గుండా వెళ్తున్న అయ్యప్ప స్వాముల కారుకు ఎదురుగా చిరుతపులి ఆగింది. కాసేపు తర్వాత అటవీ ప్రాంతంలోకి పోయినట్టు స్వాములు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాత్రి వేళల్లో ఈ మార్గం గుండా వెళ్లే వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. కాగా చిరుతపులి సంచారం కావటంతో స్థానికుల్లో భయం నెలకొంది.



సింగరేణి డంపింగ్ యార్డుపై అడవిని తలపిస్తున్న మొక్కలు

నల్లనేలపై పచ్చదనం

- బెల్లంపల్లి ఏరియాలో ఏటా విరివిగా మొక్కలు పెంపకం
- అడవిని తలపిస్తున్న డంపింగ్ యార్డులు

రెబ్బెన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోంది. బొగ్గును ఉత్పత్తి చేసే నల్లనేలలపై పచ్చదనాన్ని పరుస్తోంది. ఏటా ఏరియాల వారీగా ఖాళీ స్థలాలు, గనులు, డిపార్టుమెంట్లు, కాలనీల్లో మొక్కలు విస్తరణ పనులతో చాలా ప్రాంతాల్లో పెద్ద వృక్షాలు, చెట్లతో పాటు కొంతమేర అటవీ ప్రాంతాన్ని కోల్పోవలసి వస్తోంది. దానిని భర్తీ చేసేందుకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఎక్కడా ఖాళీస్థలాన్ని వదలకుండా పచ్చదనం పెంపొందిస్తోంది. డీ గ్రేడ్ ఫారెస్టు భూములను తీసుకుని అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషిచేస్తోంది. మూసివేతకు గురైన ఓసీపీ ప్రదేశాలు, ఓడీ డంపింగ్ యార్డులపై మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యానికి దోహదపడుతోంది. గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా మారడంతో మూసివేతకు గురైన గనుల ప్రదేశాలు, డంపింగ్ యార్డులు ప్రస్తుతం అడవులను తలపిస్తున్నాయి.

ఈ ఏడాది మూడు లక్షల మొక్కలు..

2025-26 ఏడాది బెల్లంపల్లి ఏరియాలో సుమారు మూడు లక్షల మొక్కలు సింగరేణి ప్రాంతాల్లో నాటడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, అటవీ, ప్రభుత్వ శాఖలకు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకుని సుమారు 40 హెక్టార్లలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్దం చేసి వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉద్యోగులు నివాసం ఉండే కాలనీలు, రోడ్ల వెంట నాటారు. ఎవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్, ఓబీ డంప్‌లలో మొక్కలు నాటారు. కొన్నేళ్లుగా ఏరియాలో సుమారు ఐదు నుంచి ఏడు లక్షల వరకు మొక్కలు నాటారు. వాటిలో ఓబీ డంపింగ్ యార్డుపై నాటుతున్నవే అధికంగా ఉన్నాయి.

సంరక్షణకు ప్రత్యేక చర్యలు..

ఏటా కోట్ల రూపాయలు వెచ్చించి నాటుతున్న మొక్కల సంరక్షణపై సింగరేణి ప్రత్యేకదృష్టి సారించింది. ప్రధానంగా రహదారుల వెంట నాటే వాటిని రెండేళ్లు సంరక్షిస్తోంది. పశువులకు ఆహారం కాకుండా ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం, రోజూ నీళ్లు పోయడం వంటి చర్యలు చేపడుతున్నారు. డంపింగ్ యార్డులపై నాటే వాటి కోసం నల్ల తుమ్మ, కంది, జనుము, హమాట గ్రాస్ డీస్స్ ఆగిల్ సకారం, సకారం ముంజ, ఎలిఫెంట్, టైగర్ గ్రాస్ విత్తనాలు చల్లుతూ పోషకాలు అందేలా చూస్తున్నారు. తద్వారా భూమి కోతకు గురికాకుండా ఉండడంతో పాటు కావల్సిన నత్రజని అందుతోంది. డంపింగ్ యార్డులపై నాటిన వాటిల్లో దాదాపు 80 శాతం చెట్లుగా మారుతున్నాయి. మిగిలిన 20 శాతం మొక్కల స్థానంలో కొత్తవి నాటుతున్నారు. గతంలో మూతపడిన డోర్లి-1, డోర్లి-2 ఓసీ డంపింగ్ యార్డులు నేడు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి.

డీ గ్రేడ్ ఫారెస్టు అభివృద్ధి

బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి బొగ్గు గనుల ఏర్పాటు విస్తర్ణ సమయంలో కొంత మేర అటవీ ప్రాంతాన్ని కోల్పోవాల్సి వచ్చింది. పర్యావరణం దెబ్బతినకుండా అంతరించి పోయిన అటవీ ప్రాంతాన్ని తిరిగి అభివృద్ధి చేసేందుకు యజమాన్యం డీ గ్రేడ్ ఫారెస్టును వృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా గోలేటి శివారులో 57 హెక్టార్లలో అటవీ శాఖకు చెందిన భూముల్లో మొక్కలు నాటారు. గోలేటి, మాదారం, బోయపల్లి ప్రాంతాల్లోనూ మొక్కలు నాటి అటవీ ప్రాంతాన్ని వృద్ధి చేశారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

- విజయశంకర్‌రెడ్డి, జీఎం, బెల్లంపల్లి ఏరియా



సింగరేణిలో డంపింగ్ యార్డులు, ఖాళీ ప్రదేశాలో మొక్కలు నాటడానికి సింగరేణి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. అందుకు గాను పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే ఏరియాలో పలు ప్రదేశాల్లో ప్రతీ సంవత్సరం మొక్కలు నాటుతున్నాము.



ఉద్యోగులు హాజరు శాతాన్ని పెంచుకోవాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ హాజరు శాతాన్ని పెంచుకోవాలని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని ఆర్కే 7 గనిలో జనవరి 1 నుంచి అక్టోబరు 31 వరకు కనీసం 150 మస్టర్లు నిండని ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చాలామంది యువతకు ప్రస్తుతం ఉద్యోగాలు లభించడం లేదని, సింగరేణిలో ఉద్యోగం లభించిన వారు విధులకు గైర్హాజరు కావడం సమంజసం కాదన్నారు. విధులకు వచ్చి హాజరు శాతాన్ని పెంచుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్‌లో ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, సంక్షేమాధికారి సంతన్, పిట్ కార్యదర్శి సారయ్య పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తారన్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రుగ్మతలు కలిగిన శ్రీరాంపూర్, పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కేకే ఓసీపీలో పరిహారం కాజేసేందుకు కుట్ర

- ఏళ్లుగా సాగులో ఉన్న వారికి మొండిచేయి - విచారణ చేసి పరిహారం ఇవ్వాలని భూనిర్వాసితుల డిమాండ్

కాసిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాణిఖని మెగా ఓసీపీలో భూములు కోల్పోయిన నిర్వాసితుల పరిహారాన్ని కాజేసేందుకు భారీ కుట్రలు జరుగుతున్నాయని దుబ్బగూడెం భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళ్యాణిఖని మెగా ఓసీపీలో 146 సర్వే నంబరులోని 67 ఎకరాల భూమిని కాజేసేందుకు అధికారులతో కలిసి కొంత మంది దళారులు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 70 ఏళ్ల నుంచి 25 మంది రైతులకు సంబంధించి 67 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, కళ్యాణిఖని మెగా ఓసీపీ రావడంతో ఇళ్లకు నష్టపరిహారం ఇచ్చారన్నారు. కానీ సాగులో ఉన్న గిరిజనేతరులకు నష్టపరిహారం ఇవ్వడం కుదరదని ఇటీవల అధికారులు చెప్పడం బాధాకరమన్నారు. అలాగే 144 సర్వే నంబరులో రూ. 1.30 కోట్ల పరిహారం పంపిణీలో అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేసి అర్హులైన వారిని గుర్తించి చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 70 ఏళ్ల సాగులో ఉన్న రైతులను కాదని, వలస వచ్చిన కొంత మంది గిరిజనులకు నష్టపరిహారం ఇస్తామని చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుబ్బగూడెం భూనిర్వాసితులు

అర్హులైన వారికి నష్టపరిహారం ఇవ్వకుండా అధికారులు దళారులతో కుమ్మక్కై అనర్హులకు పరిహారం పంపిణీ చేస్తే ఓసీ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. గతంలో కేకే ఓసీపీ నిర్వాసితులకు కులాలను పరిగణలోకి తీసుకోకుండా అందరికి నష్టపరిహారం అందించారని, కానీ 25 మంది రైతుల విషయంలో మాత్రం స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో భూనిర్వాసితులు బిజ్జారి రాయలింగు, కందికట్ల చంద్రకళ, గోనెల శ్రీనివాస్, రత్నం రామస్వామి, రాంటెంకి రాజేందర్, గోనె లచ్చయ్య, బాల శంకర్, లక్ష్మి, నగురారపు సుమన్, పోశం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు కార్మికులకు మెరుగైన సేవలు

- మందమర్రి జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రిటైర్డు కార్మికులకు సీఎంపీఎఫ్ పించన్‌కు సంబంధించి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు నిర్వహణ కార్యక్రమం చేపట్టామని మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో రిటైర్డు కార్మికుల డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపునకు ఆయన హాజరై మాట్లాడారు. డిజిటల్ సర్టిఫికెట్ గురించి రిటైర్డు ఉద్యోగులకు అవగాహన కల్పించడం కోసం ఈ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. గోదావరిఖని సీఎంపీఎఫ్ అధికారులతో జీవన్ ప్రమాణ్ పునరుద్ధరణ చేపడతామన్నారు. జీవన్ ప్రమాణ్ డిజిటల్ ఆన్‌లైన్‌లో ఎలా రెన్యువల్ ఎలా చేయాలో వివరిస్తామన్నారు. రిటైర్డు సింగరేణి కార్మికులు వారి వద్ద ఉన్న పీపీవో కాపీ, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా బుక్, పాన్‌కార్డు ఆధార్ కార్డు లింక్ ఉన్న మొబైల్ నెంబర్ తీసుకుని అందజేస్తే ఆన్‌లైన్ చేయవచ్చన్నారు. అనంతరం సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, సీఎపీఎఫ్ రీజనల్ కమిషనర్ గోవర్ధన్, సీనియర్ పీవో శంకర్, అధికారులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ పత్రాలను అందజేస్తున్న జీఎం రాధాకృష్ణ

వీధి కుక్క దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

దండేపల్లి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మసీద్‌వాడలో సోమవారం ముగ్గురు వృద్ధులపై ఓ వీధి కుక్క దాడి చేయడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి.

దండేపల్లికి చెందిన సాయిని లక్ష్మి, చెన్నవేని మల్లవ్వ, బొలిశెట్టి వెంకన్న సోమవారం పనులు చేసుకుని మసీదువాడ నుంచి వస్తున్నారు. ఆ సమయంలో వీధి కుక్క దాడిచేసి తీవ్రంగా గాయ పరిచింది. దీంతో వెంటనే స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

కాసిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు నిర్మించకుండా స్థానికులు అడ్డుకుంటున్నారని మండల కేంద్రానికి చెందిన పొలవేని రాజేశ్వరి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసింది. కొన్నేళ్లుగా వారసత్వంగా వచ్చిన భూమిలో నివాసం ఉంటున్నామని తెలిపారు. ఇటీవల తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సన్నాహాలు చేస్తుండగా స్థానికులు కొందరు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బొట్టు.. బొట్టు.. ఒడిసి పట్టి..



[illegible] అడ్డంగా కట్టిన చెక్‌డ్యాం

- ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులు
- జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలు
- జల్ సంచాయ్ జన్ భాగీదారీ పథకంలో జిల్లాకు జాతీయ పురస్కారం
- నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న అధికారులు



నీటి నిల్వ కోసం నిర్మించిన ఫాంపాండ్

నెన్నెల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జల సంరక్షణే జన సంరక్షణ అనే నినాదం ప్రస్తుతం ప్రపంచమంతా మార్మోగుతోంది. ఆ నినాదంతోనే మన అధికారులు ముందుకు సాగుతున్నారు. వాన నీటి సంరక్షణ బాధ్యతగా భావించారు. ప్రతీ బొట్టును ఒడిసి పట్టాలని నిశ్చ యించుకున్నారు. పరుగులు తీసే నీటికి నడకలు నేర్పారు. పారే నీటిని భూమి లోకి ఇంకించేలా పనులు చేపట్టారు. నీటి సంరక్షణ చర్యల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఫలితంగా మంచిర్యాల జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి.. పంటలతో జిల్లా పచ్చబడుతోంది. ఊట చెరువులతో వేసవిలో సైతం మూగజీవాలకు దాహార్తి తీరు తోంది. జలవృద్ధి కోసం అధికారులు చేస్తు న్న కృషితో జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభి స్తోంది.

జాతీయ పురస్కారం.. రూ. 2 కోట్ల ప్రోత్సాహకం

జిల్లాలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురుస్తున్నప్పటికీ గతంలో ఆ నీరంతా వృథాగా పోయేది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడుగంటుతున్న భూగర్భ జలాల పరిస్థితులను గమనించిన కేంద్ర ప్రభుత్వం జల సంరక్షణకు చర్యలు చేపట్టింది. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు జన్ సంచాయ్ జన్ భాగేదారి (జన భాగ స్వామ్యంతో జల సంరక్షణ) పథకాన్ని 2024లో ప్రారంభించింది.

ఈ పథకంలో చేపట్టిన పనులు జలవృద్ధికి దోహదపడుతున్నాయి. ఇందులో మెరుగైన ఫలితాలు సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ అవార్డుల్లో జల్ సంచాయ్ జన్ భాగీ దారి విభాగంలో రాష్ట్రంలో మంచిర్యాల జిల్లా మూడో స్థానంలో నిలిచింది. దక్షిణజోన్‌లో ఆదిలాబాద్, నల్గొండ జిల్లాలు ఎంపిక కాగా మూడో స్థానంలో మన జిల్లా నిలిచింది. ఈ పథకం కింద గ్రామాల్లో 84,549 పనులు పూర్తి చేసి జిల్లా ఈ ఘనతను సొంతం చేసుకుంది. పథకాన్ని ఉత్తమంగా అమలు చేసినందుకు గాను ఢిల్లీలో ఈ నెల 18న రాష్ట్రపతి ద్రౌపదిముర్మ చేతుల మీదుగ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ రూ. 2 కోట్ల ప్రోత్సాహకంతో పాటు ప్రత్యేక పురస్కారాన్ని అందుకోనున్నారు.

మండలాల వారీగా పనులు...

జల సంరక్షణ కోసం జిల్లాలో మొత్తం 84,549 పనులు చేపట్టారు. 6,434 పనులతో జిల్లాలో కోటపల్లి మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. 6,335 పనులతో దండెపల్లి, 6218 పనులతో జన్నారం మండలాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయి. జైపూర్ మండలంలో 5,580 పనులు, భీమారంలో 5,692, తాండూరు 5,306, చెన్నూరు 4,920, నెన్నెల 5066, కాసిపేట 6,115, భీమిని 5,762, వేమనపల్లి 5,096, లక్షెట్టిపేట 4,090, హాజీపూర్ 4,231, బెల్లంపల్లి 4,207, మందమర్రి 4,388, కన్నెపల్లి మండలంలో 5,723 పనులు చేపట్టాలరు.

సమష్టి కృషితో జాతీయ స్థాయి గుర్తింపు

ఎస్. కిషన్, డీఆర్‌డీవో



కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ స్థాయి అవార్డుల్లో జల్ సంచాయ్ జన్ భాగీదారి విభాగంలో దక్షిణ జోన్ నుంచి మన జిల్లా మూడో స్థానంలో నిలిచింది. కలెక్టర్ కుమార్ దీపక్ దిశా నిర్దేశం, అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయడం వల్లే మంచిర్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జిల్లా వ్యాప్తంగా 84,549 పనులను పూర్తి చేశాం. పనుల తర్వాత భూగర్భ జలాలు పెరిగాయి. రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారంతో పాటు రూ. 2 కోట్ల ప్రోత్సాహకం స్వీకరించడం సంతోషంగా ఉంది. రాబోయే కాలంలో మరిన్ని పనులు చేపట్టి అగ్రస్థానంలో నిలిచేందుకు కృషి చేస్తాం.

చేపట్టిన పనులు ..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, భూగర్భ జల వనరుల శాఖల ఆధ్వర్యంలో ఉపాధిహామి, పీఎంకేఎస్‌వై పథకాల ద్వారా జల సంరక్షణకు పనులు చేపట్టారు. వ్యవసాయ, అటవి భూముల్లో కురిసే వర్షపు నీటిని బయటకు వెళ్లకుండా అక్కడే ఇంకించాలనే లక్ష్యంతో పనులు చేశారు. మినీ ఊట కుంటలు, చెక్‌డ్యామ్‌లు, బావుల పునరుద్ధరణ, సాగు నీటి కాలువల రిపేరు, కాంటూరు కందకాలు, ట్రెంచుల తవ్వకం పనులు చేపట్టారు. సామాజిక, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, మట్టి కట్టలు, బోరు బావుల రిచార్జీ పనులు, రూఫ్‌టాప్ రేయిన్ వాటర్ స్టోరేజ్ తదితర పనులు చేపట్టారు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పనుల వివరాలను అప్‌లోడ్ చేశారు. జూన్ 19 నుంచి జులై 12 వరకు కేంద్ర జలవి భాగం శాస్త్రవేత్త కొల్లి రాంబాబు ఆధ్వర్యంలో పరిశీలన బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పరిశీలించింది. సంరక్షణ పనులతో భూగర్భ జలాలు పెరిగినట్టు గుర్తించారు. ప్రస్తుత వ్యవసాయ దిగుబడులకే కాకుండా భవిష్యత్తు తరాల మనుగడకు జలసిరిని అందించేలా చర్యలు చేపట్టారని సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ బృందం సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం పురస్కారలు, ప్రోత్సహకాలను ప్రకటించింది.

ట్యాంక్‌బండ్‌పై బీఎన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

బెల్లంపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఎంసీపీఐయూ మాజీ ఎంపీ కామ్రేడ్ బీం రెడ్డి నర్సింహారెడ్డి విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. సోమవారం ఎంసీపీఐయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ బీం రెడ్డి నర్సింహారెడ్డి త్యాగాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ రెండో దశ కాలువకు బీఎన్ రెడ్డి నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. నైజాం రజాకార్ల దోపడికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేసేందుకు భీం రెడ్డి త్యాగాలు మరువలేనివన్నారు. ప్రభుత్వం ట్యాంక్ బండ్‌పై బీఎన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న పెద్ద ఎత్తున ఇందిరాపార్కు వద్ద ఎంసీపీఐయు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నామని కార్యకర్తలు తరలిరావాలని పేర్కొన్నారు.

వాహనాలు సీజ్

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 25 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చాలా మంది వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తనిఖీలు చేపట్టామన్నారు. 25 మంది రోడ్డు భద్రతకు భంగం కలిగిస్తూ ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడంతో 25 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టణంలోని బురదగూడం నుంచి కేకే ఓసీపీ టోల్ ప్లాజా వరకు ఇటీవల ఇద్దరు మృతిచెందారని, ఇద్దరు గాయపడ్డరన్నారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాంగ్‌రూట్‌లో రాకూడదని తెలిపారు. త్వరగా వెళ్లాలని జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. రాంగ్‌రూట్‌లో వచ్చే ఏ వాహనాన్ని తాము వదిలిపెట్టేది లేదని సీజ్ చేస్తామన్నారు. ప్రతీ ఒకరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు.

కూతురి హత్య కేసులో తండ్రి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన కూతురి హత్య, కొడుకుపై హత్యాయత్నం కేసులో వారి తండ్రి అనవేణి మల్లేష్ (38)ను కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జాన్‌రెడ్డి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన అనవేణి మల్లేష్ 15 ఏళ్లుగా నగరంలోని వావిలాలపల్లి వాసవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. హమాలీ పనిచేసుకుంటూ భార్య పోసవ్వ, దివ్యాంగులైన కూతురు హర్షిత, కొడుకు హర్షిత్‌ను పోషించుకుంటున్నాడు. పిల్లలిద్దరూ చిన్న వయస్సు నుంచి మానసిక, శారీరక అంగవైకల్యంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం అనేక ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించారు. పిల్లల పరిస్థితి జీవితాంతం మారదని వైద్యులు స్పష్టం చేయడంతో నిందితుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ నెల 15న మధ్యాహ్నం నిందితుడి భార్య మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో మల్లేష్ మొదట కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి పిల్లలకు ఇవ్వడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. అనంతరం ఒక కాటన్ టవల్‌ను రెండు ముక్కలు చేసి వాటితో కూతురు(హర్షిత), కొడుకు(హర్షిత్) మెడకు ఉరి వేశాడు. దీంతో కూతురు మరణించగా, కొడుకు స్పృహకోల్పోయాడు. అనంతరం మల్లేష్ టవల్ ముక్కలను బయట పారేసి ఇంటినుంచి పారిపోయాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఉదయం కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లేష్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడి మొబైల్ ఫోన్, రెండు బస్ టికెట్లు, హత్యకు ఉపయోగించిన రెండు కాటన్ టవల్ ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించనున్నారు.

సమయ పాలన పాటించని అధికారులు

భీమారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.15 గంటలకు సైతం కార్యాలయం తెరవడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి రాగా 10.30 గంటల వరకు కార్యాలయం తెరిచారని, అధికారులు మాత్రం ఎవరు లేరని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉన్నప్పటికీ కొందరు మాత్రమే హాజరవుతుండడంతో ఫిర్యాదు దారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని చూడాలని, అధికారులు సమయ పాలన పాటించేలా, కార్యాలయం సమయానికి తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

జైపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటు చేసిన జైపూర్ సర్కిల్‌లో సీఐగా కె. నవీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం కమీషనరేట్‌లో సైబర్ క్రైమ్‌లో సీఐగా విధులు నిర్వహించిన ఆయన జైపూర్ సీఐగా బదిలీపై వచ్చారు. జైపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ జైపూర్, భీమారం మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరిస్తాం

బెల్లంపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు విన్న వించుకునే సమస్య లను త్వరితగతిన పరిష్కరిస్తామని బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజల సమస్యలకు నేరుగా సంప్రదించాలని సూచించారు. ప్రజావాణిలో భాగంగా భూసమస్యలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల అర్జీలను అందించారు. డీఏవో హన్మంతరావు, పాల్గొన్నారు.

గాజులు, గోరింటాకుతో సందడి



ఒకే రకం చీరలను కట్టుకుని గాజులతో సందడి చేస్తున్న మహిళలు

దండేపల్లి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్షిప్ గాజుల పండుగ పేరిట వారం రోజులుగా మండలంలోని పలు గ్రామాలోని పలువురు మహిళలు, గ్రామైఖ్య సంఘాల సభ్యులు సందడి చేస్తున్నారు. ఒకే కాలనీ మహిళలంతా కలిసి కార్తీకమాసంలోఒకే చోట కలుసుకోని ఒకరికి ఒకరు చేతులకు గాజులు వేసుకుంటూ అరచేతిలో గోరింటాకు పెట్టుకుంటు గాజుల సవ్వడితో సందడి చేశారు. సోమవారం దండేపల్లిలో బాల గణేష్ పడమాటి వాడకటు మహిళలంత కలిసి స్థానిక పద్మశాలి భవనంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం కార్తీకమాసం సందర్భంగా కుటుంబసమేతంగా అక్కడే వన భోజనం చేశారు. అనంతరం ఆటపాట నృత్యాలతో ఒకే రకం చీరలతో సందడి చేశారు. మార్కెట్‌లోకి వచ్చిన ఈ నయా ట్రెండ్‌ను ఫాలో అయ్యేందుకు పలువురు మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

ధ్వంసమైన వరి పంట పరిశీలన

మందమర్రిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సారంగపల్లి గ్రామంలో చిందం భాస్కర్ అనే రైతుకు చెందిన రెండు ఎకరాల వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో సోమవారం చెన్నూరు వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఫారెస్టు అధికారులు పంటను పరిశీలించారు. చేతికి అంది వచ్చిన పంటను అడవి పందులు ధ్వంసం చేశాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

బుగ్గదేవాలయానికి వెండి నాగపడిగను అందజేత



వెండి నాగపడిగతో భక్తులు

బెల్లంపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామంలో గల శ్రీబుగ్గరాజరాజేశ్వర దేవాలయానికి సోమవారం వెండి నాగపడిగను మందమర్రికి చెందిన మెరుగు గణేష్ స్రవంతి దంపతులు అందజేశారు. వేదపండితులు మంత్రోత్సవాల మధ్య వెండి నాగపడిగను దేవాలయంలో దేవాలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం బోయపల్లి బోర్డుకు చెందిన లక్ష్మీ నారాయణ సరిత దంపతులు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

ఐటీ హబ్ స్థలంలో మట్టి దందా...

(5వ పేజీ తరువాయి)

ఆనుకొని ఉండటంతో రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టి దానిపై పడటం లేదు. ప్రత్యేకంగా పని కోసం వెళ్లేవారు మినహా అటువైపుగా రాత్రి వేళల్లో దాదాపు ప్రజలు వెళ్లే అవకాశాలు అరుదు. పగటి పూట సైతం పశువుల కాపర్లు, పరిసరాల్లో రియల్ వ్యయసాయం చేసే వారు తప్ప ఇతరుల సంచారం చాలా తక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకుంటున్న అక్రమార్కులు పెద్ద ఎత్తున తవ్వకా లు జరుపుతుండగా, ఆ ప్రదేశంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి.

రియల్ వెంచర్లకు తరలింపు...

ఇండస్ట్రియల్, ఐటీ హబ్ కోసం కేటాయించిన స్థలంలో మెత్తటి మొరంతో కూడిన నాణ్యమైన మట్టి లభిస్తుంది. ఆ మట్టిని రోడ్ల నిర్మాణం, లోతుగా ఉన్న ప్రాంతాల్లో నింపడానికి ఉపయోగిస్తే వర్షాకాలంలోనూ బురదమయం కాకుండా ఉంటుంది. శిలాఫలకం చుట్టూ ఉన్న ప్రాంతమంతా గతంలో బొందలు, గుంతలు గా ఉండేది. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు సందర్భంగా స్థలాన్ని చదును చేశారు. దీంతో అక్కడికి వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. దీన్ని ఆ సరగా మలుచుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు జేసీబీ యజమానులతో ఒప్పందం కుదుర్చుకొని తవ్వకాలు జరుపుతున్నారు. ఈ ప్రాంతంలో లభించే మట్టి ఒక్కో లారీ ట్రిప్పు రూ. 8 వేల వరకు ధర పలుకు తోంది. అలా నిత్యం 20 నుంచి 30 లారీల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. జేసీబీ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కారణంగా ఇండస్ట్రియల్ పార్కు ప్రాంతమంతా ప్రస్తుతం భారీ గుంతలు ఏర్పడగా, ప్రభుత్వ ఖజనాకు రాయల్టీ రూపంలో పెద్ద మొత్తంలో గండి పడుతోంది. ఐటీ పార్కు కోసం వ్యాపారులకు స్థలాలు అప్పగించాల్సి ఉన్నందున మట్టి తవ్వకాల వల్ల ఆ ప్రాంతంలో ఏర్పడ్డ భారీ గుంతలను తిరిగి పూడ్చాల్సి ఉంటుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

దాని కోసం పెద్ద మొత్తంలో మట్టి అవసరం కాగా, ఇతర ప్రాంతాల నుంచి తరలించాల్సి వస్తుందని, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చుల కోసం వెచ్చించాల్సి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భ గనులు, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి, అక్రమ మట్టి రవాణాను తక్షణమే అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తాండూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యుశక్తి ఫోరం ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఎంఈవో మల్లేశం, మాదారం ఎస్‌ఐ సౌజన్యలు హాజరై మాట్లాడారు. పోటీల్లో మండలంలోని పాఠశాలల నుంచి 50 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉమా దేవి, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు దత్తాత్రేయరావు పాల్గొన్నారు.

సీఐటీయూ కమిటీ ఎన్నిక

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం అనుబంధం సీఐటీయూ యూనియన్ జిల్లా కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రమణ వెల్లడించారు. కార్యదర్శిగా దుంపల రంజిత్‌కుమార్, కోశాధికారిగా దూలం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సమ్మక్క, సంకె రవి, కాసర్ల రాయలింగు, సహాయ కార్యదర్శులుగా వెంకటస్వామి, రాజేశ్వరి, భానుమతి లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులుగా ప్రకాష్, రాజరావు, దేవదాస్, రవి, లక్ష్మణ్, రాజేశం, స్వాతి, చిన్నయ్య, రమేష్, పద్మావతి, లీలారాణిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవు'

జైపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సూచించిన ఫీజులే కాకుండా అధికంగా ఫీజులు వసూలు చేస్తే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థులు వందశాతం యుడైస్‌లో రిజిష్టర్‌లో ఒకే విధంగా ఉండాలన్నారు.

లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి కోల్‌బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని సోమవారం పట్టణంలో నియమించారు. అధ్యక్షుడిగా బొద్దున ఓంప్రకాష్, గౌరవాధ్యక్షుడిగా బండి సదానందంయాదవ్, వైస్ ప్రెసిడెంట్ గాజులస్వామి, ప్రధాన కార్యదర్శి హరిబాబు, జాయింట్ సెక్రటరీగా అశోక్, ప్రచార కార్యదర్శిగా రాజేశం, కోశాధికారిగా ఉమామహేశ్వర్‌రావుతో పాటు 17 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సభ్యులు సన్మానించారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని బీర్వెల్లి గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య పనులను, వైకుంఠ దామం, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పారిశుధ్యపనులను చేయాలని, రోడ్లపై చెత్త, చెదారం లేకుండా చూడాలన్నారు. సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మరమ్మతులు చేస్తున్న డైనింగ్ హాల్ పనులను, పిల్లల విద్యాభ్యాసాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో అజ్మత్ ఆలీ, ఈ పంచాయతీ ప్రాజెక్టు మేనేజర్‌నరేందర్, పంచాయతీ కార్యదర్శి సంపత్ ఉన్నారు.

కత్తి పోట్ల కేసులో నిందితుల అరెస్టు

నెన్నెల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెన్నెల మండలం ఘన్‌పూర్ గ్రామంలో కత్తి పోట్లతో కలకలం రేపిన జోగాపూర్ గ్రామానికి చెందిన కొడిపె అశోక్‌తో పాటు అతడికి సహకరించిన స్నేహితుడు సింధం అంజీ, అన్న కొడిపె రాజులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. కేసు వివరాలను నెన్నెల ఎస్సై ప్రసాద్‌తో కలిసి బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్‌సోమవారం వెల్లడించారు. భూపాల్‌పల్లి జిల్లా సూరారం గ్రామానికి చెందిన చీర్ల హరీష్ వరసకు సోదరుడైన సురేష్‌తో కలిసి నెన్నెల మండలం కోనంపేటకు ఆదివారం సాయంత్రం కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఘన్‌పూర్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో బంపర్‌కు కార్ తగిలింది. ఈ విషయంలో ఆటో డ్రైవర్ అశోక్‌తో గొడవ జరిగింది. దీంతో ఆటోలో సీటు కింద ఉన్న కత్తి తెచ్చి హరీష్‌ను చాతిపై రెండుసార్లు పొడవడంతో అతడు పడిపోయాడు. సురేష్‌పై దాడి చేసేందుకు ప్రత్నించగా అతడు తప్పించుకున్నాడు. గ్రామస్థులు అశోక్‌ను అడ్డుకోవడంతో ఆటోతో పారిపోయాడు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. చిత్తాపూర్ మామిడి తోటలో దాక్కొని ఉన్న అశోక్‌ను సోమవారం పట్టుకున్నారు. ఆటోతో పాటు కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బెల్లంపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనోక్, ఎస్సై ప్రసాద్

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న చిన్నారులు

మంచిర్యాల క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తోళ్లవాగు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు మంచిర్యాల స్మార్ట్ కిడ్స్ విద్యార్థులు సోమవారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు సేవా భావం పెంపొందించేందుకు చేపట్టామన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల సీసీ నస్పూర్‌లో దివంగత సీనియర్ జర్నలిస్టు మునీర్ స్మారకార్థం నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలంగాణ కుంగ్‌పూ కరాటే పోటీల్లో మందమర్రి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులను సోమవారం మందమర్రి ఎస్‌ఐ రాజశేఖర్ అభినందించారు. మాస్టర్ కృష్ణ పాల్గొన్నారు.

చదువులో ముందుండాలి

కాసిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాలికలు చదువులో ముందుండాలని మహిళ సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ, ఫైన్‌ఆర్ట్స్ లిటరసీ సభ్యురాలు లిప్సిక పేర్కొన్నారు. సోమవారం దేవాపూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో భేటి పడావో భేటి బచావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 18 నవంబరు 2025



బొట్టు..బొట్టు... ఒడిసి పట్టి..

- ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులు
- జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలు
- జల్ సంచాయ్ జన్ భాగీదారీ పథకంలో జిల్లాకు జాతీయ పురస్కారం
- నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న అధికారులు

7

కార్తీకమాసం.. భక్తిపారవశ్యం



వ్రతాలు చేస్తున్న భక్తులు

కార్తీకమాస చివరి సోమవారం పురస్కరించుకుని దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు ఉదయమే గోదావరి స్నానాలు ఆచరించి అనంతరం కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం అక్కడి నుంచి ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలోని ఉసిరిక చెట్టు కింద దీపాలు వెలిగించి భక్తిప్రవత్తులు చాటుకున్నారు. 460మంది భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను నోముకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు.

- దండేపల్లి, ఆంధ్రజ్యోతి



దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

విద్యార్థులకు షీటీంపై అవగాహన

మంచిర్యాల క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఎస్సై ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. తమకు సమస్యలు ఎదురైనప్పుడు 100కు డయల్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో షీటీం సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి కేసీఆర్ పరామర్శ

మంచిర్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మంచిర్యాలకు చెందిన గోగుల రవీందర్‌రెడ్డిని సోమవారం ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. గోగుల రవీందర్‌రెడ్డి తండ్రి ముకుందరెడ్డి అనారోగ్యం కారణంగా ఈ నెల 16న మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం సమయంలో రవీందర్‌రెడ్డికి ఫోన్ చేసి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజావాణికి అధికారుల డుమ్మా...

కోటపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని నెరవేర్చేందుకు ఉద్దేశించిన ప్రజావాణి కార్యక్రమం నీరు గారి పోతుంది. కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొడుతుండడంతో ప్రజలు సైతం ఫిర్యాదులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కేవలం ఐదు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీవో, ఎంఈవో, ఐకేపీ సీసీ, పంచాయతీరాజ్ ఏఈ, ఇరిగేషన్ సిబ్బంది మినహా ప్రజావాణికి మిగతా ఎవరు హాజరు కాలేదు. 20కి పైగా శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐదు శాఖల వారు మాత్రమే హాజరయ్యారు. మరో వైపు ఫిర్యాదుదారులు ఎవరు కూడా రాకపోవడంతో ప్రజావాణికి స్పందన కరువైంది.

ఐటీ హబ్ స్థలంలో మట్టి దందా



మట్టి తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంతలు

- రాత్రివేళల్లో జేసీబీలతో తవ్వకాలు
- లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా
- శిలాఫలకం సమీపంలో ఏర్పడ్డ భారీ గుంతలు

మంచిర్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ హబ్ కోసం కేటాయించిన స్థలంలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. వారం పది రోజులుగా రాత్రివేళల్లో గుట్టు చప్పుడు కాకుండా తవ్వకాలు జరుపుతున్న గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద మొత్తంలో మట్టిని లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం సమీపంలోనే అక్రమ తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి, పోశంపహాడ్ శివారులో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దత్తసాయి ఇండస్ట్రియల్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీతోపాటు ఆటోనగర్ పార్క్ ఏర్పాటు చేసేందుకు 292 ఎకరాల స్థలాన్ని రైతుల నుంచి భూ సేకరణ ద్వారా కేటాయించారు.

పరిశ్రమల ఏర్పాటు సమయంలోనే..

ఇండస్ట్రియల్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీతోపాటు ఆటో నగర్ పార్క్ ఏర్పాటుకు స్థలం కేటాయింపులు పూర్తి కావడంతో త్వరలో పరిశ్రమలు స్థాపించే వ్యాపారులకు భూములు అప్పగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక శ్రద్ధతో పురుడు పోసుకున్న భారీ ప్రాజెక్టు ద్వారా వందలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించనుండగా, ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించనున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడా కూడా ఇండస్ట్రియల్, ఐటీ హబ్ పార్కు లేకపోగా తొలిసారిగా మంచిర్యాల నియోజక వర్గంలోనే దానికి అంకురార్పణ జరిగింది. ఇండస్ట్రియల్ పార్క్‌కు ఈ ఏడాది జూలై 13న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు కేటాయించేందుకు సన్నద్ధం అవుతున్న తరుణంలోనే మట్టి తవ్వకాలు కలకలం రేపుతున్నాయి.

రాత్రి సమయంలో తవ్వకాలు....

ఇండస్ట్రియల్, ఐటీ పార్కు కోసం కేటాయించిన భూ ముల్లోని సర్వే నంబర్‌లు 154, 155, 159లలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ప్రతిరోజూ రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు జేసీబీల సహాయంతో తవ్వకాలు జరుపుతూ లారీల ద్వారా పెద్ద మొత్తంలో మట్టిని తరలిస్తున్నారు. సదరు స్థలం జనావాసాలకు దూరంగా ఉండటం, అటవీ ప్రాంతాన్ని..

(తరువాయి 7లో)

ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిన గీతం వందేమాతరం



వందేమాతర గీతం ఆలపిస్తున్న బీజేపీ నాయకులు, వ్యాపారులు, ప్రజలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలందర్నీ ఏకతాటిపైకి తెచ్చింది వందేమాతర గీతం అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాధ్ వెరబెల్లి పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ రోడ్డులో సామూహిక వందేమాతర గీతాలాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతర గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలందరిలో పోరాట స్ఫూర్తిని రగిలించిందన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని ప్రతి ఒక్కరు తలుచుకుంటూ వారి ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు గాజుల ముకేష్‌గౌడ్, పురషోత్తం జాజు, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, శ్రీశైలం, చక్రవర్తి, వేణుగోపాల్, కమలాకర్‌రావు, ప్రభాకర్, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, తిరుపతి, వెంకటేశ్వర్లు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దర ఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జైపూర్, మందమర్రి, మంచిర్యాల, తాండూర్, బెల్లంపల్లి, రామకృష్ణపూర్, కాసిపేట, ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. ప్రజావాణిలో 27 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ బిల్స్ చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

లక్షెట్టిపేట, నవంబరు, 17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్స్‌ను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ డిమాండ్ చేసారు. సోమవారం లక్షెట్టిపేట మండల విద్యా వనరుల కేంద్రం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో మధాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులతో కలిసి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.10వేల వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారని అది ఇవ్వకపోవడంమే కాక కనీసం పాత బకాయిలను చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. బిల్లుల ను చెల్లించడంతో పాటు మెనూ చార్జీలను కూడా పెంచాలన్నారు. అనంతరం ఎంఈవో శైలజకు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పోశవ్వ, అమృత, శంకరమ్మ, లక్ష్మి, లచ్చవ్వ, మల్లేశ్వరి, జానకి ఉన్నారు.

నేడు గాంధారి మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన ఆలయం

రామకృష్ణాపూర్, నవంబరు17(ఆంధ్ర జ్యోతి): గాంధారీ మైసమ్మ ఆలయం నిర్మించి 19 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి అభిసేకం, కుంకుమార్చన, అలంకరణ, హోమ కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. బొక్కలగుట్ట గ్రామంలో ప్రజలు పంటలు చేతికివచ్చిన తరువాత అమ్మవారికి గుట్టపైకి వెళ్లి నైవేద్యంగా అందించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు వసతులను ఏర్పాటు చేశారు. అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

దండేపల్లిలో ఆకట్టుకున్న సైన్స్ ప్రోగ్రామ్

దండేపల్లి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంత భావి శాస్త్రవేత్తలుగా ఎదిగి నూతన ప్రయోగాల దిశగా అడుగులు వేయాలని దండేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు సూచించారు. సోమవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలోని జిల్లా విద్యాశాఖ, సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిజ్ఞాస సైన్స్ ప్రోగామ్ విద్యార్థులను ఆకట్టుకుంది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ భారతదేశంలో ప్రభుత్వ పాఠశాలలకు ఆచరణాత్మక సైన్స్ విద్యను తీసుకొచ్చే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్ర పరికరాలతో నిండిన మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీంతో విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోగం, ఉత్సుకత, ఆవిష్కరణ, పాఠ్యపుస్తకాలకు మించి ఆభరణాత్మక అభ్యాసానికి ఎంతో పెంపొందిస్తుందన్నారు. అనంతరం సైన్స్ ల్యాబ్ ద్వారా విద్యార్థుకు అర్థమయే రీతిలో ఉపాద్యాయులు వివరించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

నస్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పని చేసే కార్మికుల డాటాను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందన్నారు. మూడు దశాబ్దాలుగా మున్సిపాలిటీలో పారిశుధ్య, ఇంజనీరింగ్, వాటర్ సరఫరా, ఎలక్రిషన్స్, వివిధ విభాగాల్లో కార్మికులు పని చేస్తున్నారన్నారు. 60 ఏళ్లకు పైబడిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఒక్కరి అవకాశం కల్పించాలన్నారు. వారి కుటుంబ సభ్యుల పిల్లల పేర్లను సీడీఎంఏ కార్యాలయానికి పంపాలని కోరారు. 60 సంవత్సరాల పైబడిన వారికి పీఎఫ్, ఈఎస్ఐ వర్తించకపోవడం వలన ప్రభుత్వ పరంగా వచ్చే మెడికల్ పీఎఫ్ రాకపోవడంతో నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. తగిన న్యాయం జరిగే విధంగా వారసత్వ ఉద్యోగాలు వచ్చే విధంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో నస్పూర్ అధ్యక్షుడు కోయ్యల వెంకటి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి సోయల్ ఖాన్, నాయకులు రాజేందర్, సుధాకర్, సాగర్, తిరుపతి, సత్యనారాయణ, రజిత, అశోక్, దుర్గమ్మ, పద్మ, రమా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదరించి..అండగా నిలబడి

మాజీ మావోయిస్టుకు కంటి శస్త్ర చికిత్స చేయించిన పోలీసులు



సీఐ, ఎస్ఐలతో మాజీ మావోయిస్టు సభ్యుడు

కోటపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : లొంగిపోయిన మావోయిస్టులకు అండగా ఉంటామని ఎలాంటి సమస్య వచ్చినా ఆదుకుంటామని ఇచ్చిన మాట ప్రకారం ఆ మాటను నిలబెట్టుకున్నారు కోటపల్లి పోలీసులు..

మండలంలోని పారుపెల్లికి చెందిన మావోయిస్టు సభ్యుడు ఆత్రం లచ్చన్న తన భార్యతో కలిసి ఇటీవల పోలీసులకు లొంగిపోయిన విషయం తెలిసిందే. అతని కంటికి చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌లు మంచిర్యాలలోని పవన్ ఆప్టికల్స్ ద్వారా ఉచితంగా కంటి శస్త్ర చికిత్స చేయించారు. లొంగిపోయిన మావోయిస్టుల పట్ల పోలీసులు చూపిస్తున్న ఆదరణను తెలుసుకుని తాను కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకుని ఇటీవల లొంగిపోయినట్లు మాజీ మావోయిస్టు సభ్యుడు ఆత్రం లచ్చన్న తెలిపాడు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ పోరు వద్ద ఊరు ముద్దని, ఆయుధాలను అజ్ఞాతంను వీడిమావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని కోరారు. వారికి పోలీసు శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలికి నేచురోపతి..



మాట్లాడుతున్న డాక్టర్ సమీరారెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన జీవన శైలికి నేచురోపతి ఎంతో ఉపయోగపడుతుందని నేచురోపతి యోగా వైద్యురాలు పోటు సమీరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జాతీయ నేచురోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ కార్యాలయంలో ఉచిత నేచురోపతి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేచురోపతి చికిత్స ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు, ఒత్తిడి సమస్యలు సమర్థవంతంగా నియంత్రించ వచ్చన్నారు. అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో ఈ వైద్యం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ నేచురోపతి చికిత్సను అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహజ చికిత్సల ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు మానసిక ప్రశాంతతకు యోగా, ధ్యానం చేయాలన్నారు. ప్రకృతి లభించే సహజ శక్తులను వైద్య సామర్థ్యాన్ని ఈ ప్రక్రియ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. మూలిక వైద్యం, ఆహార నియమాలు, వ్యాధులకు కారణమయ్యే లక్షణాలను కనిపెట్టడం, స్వీయం వైద్యం వంటివి నేచురోపతి ద్వారా సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో అనిత, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, డాక్టర్ సుకుమార్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ముదిరాజ్ జిల్లా మహాసభ అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి తిరుపతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. మత్స్య కారుల అభివృద్ధి కోసం ప్రత్యేక కోఆప రేటివ్ ఫెడరేషన్ ఎన్నికలు నిర్వహించి పాలక మండలి ఏర్పడేలా చర్యలు చేపట్టాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు పింఛన్‌లు ఇవ్వాలన్నారు. నాయకులు శ్యామ్, తిరుపతి, సుమన్, రాజేష్, తిరుపతి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



పోలీసులకు సూచనలు ఇస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

జైపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. ప్రమాదాల నివారణ చర్యలకు డీజీపీ చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరిగే స్థలాలను ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, హెచ్ఆర్‌కే సంస్థ అధికారులతో కలిసి సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా మూల మలుపు వద్ద ఏర్పాటు చేస్తున్న ఐల్యాండ్‌ల ఏర్పాటు, డిజైన్, గతంలో ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, ప్రమాదాల నివారణకు చర్యలు, రేడియం బ్లింకర్స్, స్టడ్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రమాద స్థలాల గుర్తింపు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు గురై ఎన్నో కుటుంబాలు మనో వేదనకు గురవుతున్నాయన్నారు. ప్రతీ రోజు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గుర్తు పెట్టుకుని ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. మద్యం సేవించి అతి వేగంగా వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత రామగుండం కమిషనరేట్‌గా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉండాలన్నారు. అరైవ్ అలైవ్ ద్వారా విద్యార్థులు, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే కాకుండా ట్రాఫిక్ నియాలను పాటించాల్సిన అవసరం స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.